క్లుప్తంగా

రాయితీ విత్తనాల పంపిణీ



రైతులకు రాయితీ విత్తనాలను అందజేస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

దొర్నిపాడు: రబీ సీజన్‌లో భాగంగా సాగు చేస్తున్న శనగ పంటకు కావాల్సిన రాయితీ విత్తనాలను ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం గుండుపాపల గ్రామంలో రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్వింటా పూర్తి ధర 8,100కాగా 40 శాతం రాయితీతో రూ.4,860 ఇస్తున్నట్లు చెప్పారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులందరూ వెంటనే శనగ విత్తనాలను పొందాలన్నారు. సాగుకు ముందే విత్తనాలు చేతికి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఓ సునీత, సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి, వీఏఏలు గురుగోవర్దన్, రంగారెడ్డి, సర్పంచి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌లో ఎస్పీజీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ పాఠశాల విద్యార్థులు 2కే రన్‌లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం స్టీఫెన్, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ బుధవారం తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శారదాబాయి హాజరై విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విజేతలైన భార్గవి, లహరిలకు రూ.2వేల చెక్కును అందజేశారు.

సాంకేతిక సమస్యలతోనే విద్యుత్ అంతరాయం

మహానంది: విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలో సాంకేతిక సమస్యలు రావడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్‌శాఖ నంద్యాల రూరల్ ఏడీ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహానంది సబ్‌స్టేషన్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించి వివిధ రికార్డులు పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రెండు లేదా మూడురోజుల అనంతరం వ్యవసాయ, గృహ వినియోగదారులకు పూర్తిస్థాయిలో సరఫరా ఇస్తామన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఏఈఈ ప్రభాకర్‌రెడ్డి, జేఈ శివశంకర్, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు.

29న దూదేకుల సింహగర్జన



పోస్టర్లను విడుదల చేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): గుంటూరులో ఈ నెల 29న జరిగే దూదేకుల సింహ గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక కార్యాలయంలో బుధవారం నంద్యాల జిల్లా దూదేకులం సంఘం నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ బాబన్ మాట్లాడుతూ దూదేకుల వారికి చట్టసభల్లో అవకాశం కల్పించిన పార్టీలకు మద్దతు ఇస్తామని, రాజకీయ పార్టీలు కనీసం రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని కోరారు. సింహ గర్జనలో జిల్లాలోని దూదేకుల కులస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దస్తగిరి, ఆదామ్‌సాహెబ్, సోమశేఖర్, దస్తగిరి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, క్రాంతి, ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రులు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఈ నెల 15 నుంచి శ్రీమత్కన్యాకా పరమేశ్వరీ శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆ గ్రామానికి సంబంధించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం స్థానిక అమ్మవారి శాలలో విడుదల చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ముడియం నరసింహారావు, క్రిష్ణమూర్తి మాట్లాడుతూ కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలక్రిష్ణ, మద్దిలేటయ్య, మాధవ నరసింహ్మయ్య పాల్గొన్నారు.





బిల్లలాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సెహలాం, డబ్ల్యూ గోవిందిన్నెలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, పేరూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వెంకట సుబ్బయ్య



కోటకందుకూరులో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం

- గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- ఉచితంగా మందులు, కంటి అద్దాల పంపిణీ
- ప్రజల నుంచి విశేష స్పందన



సాంబవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, అధికారులు

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక వైద్య నిపుణల ద్వారా వైద్య సేవలు అందేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. శిబిరంలో వైద్యులు గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మాధవిప్రసన్న, మురళిమోహన్‌లు 524 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 మందిని ఇతర ప్రాంతాల ఆసుపత్రులలో వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా రెఫరల్‌కు పంపించారు. శిబిరాన్ని డీఎంఅండ్ హెచ్‌ఓ వెంకటరమణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, పీడీ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐజయ్య, ఎంపీటీసీ భారతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ విజయశేఖర్, ఈఓఆర్డీ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

నంద్యాల(అర్బన్): మండలంలోని బిల్లలాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. 506 మందికి వైద్యులు సెహలాం, ఉదయ సంధ్య, అనితలతో పాటు వైద్య సిబ్బంది చికిత్సలు అందించి మందులను ఉచితంగా అందజేశారు. గ్రామ సర్పంచ్ రవణమ్మ, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, కంటివైద్య నిపుణులు నారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్దం శివరాం తదితరులు పాల్గొన్నారు.

కోటకందుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరంను నిర్వహించారు. వైద్యులు 756 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు డీఎల్‌డీఓ జనార్దన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రమణయ్యలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ఆధునిక వైద్యం

దొర్నిపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధునిక వైద్యాన్ని ప్రజలకు చేరువచేశారని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో నిర్వహించారు. వైద్యులు నాగసాయి, శిరీష, భార్గవి, హిమజ, నాగేంద్ర, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ ఉషారాణిలు 520 మందికి వైద్యపరీక్షలు నిర్వహిచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచి బాలయ్య, నాయకులు జాకీర్‌బాషా, శాంతయ్య, డీలర్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు డీఎల్‌డీఓ జనార్దన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రమణయ్య తనిఖీ చేశారు.

అందరికి రక్ష..జగనన్న ఆరోగ్య సురక్ష

రుద్రవరం: జగనన్న ఆరోగ్య సురక్ష అందరికీ రక్ష అని హౌసింగ్ పీడీ వెంకట సుబ్బయ్య అన్నారు. మండల పరిధిలోని పేరూరులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో మొత్తం 521 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదన రెడ్డి, సర్పంచు దేవదానం, నాయకులు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, బాల నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



చాగలమర్రిలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



చాగలమర్రిలో మందులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పేదల ఆరోగ్యమే జగనన్న ధ్యేయం

చాగలమర్రి: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకున్న సీఎంను గతంలో ఎన్నడు చూడలేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ తౌలసమ్మ, ఉప సర్పంచ్ షేక్.మహమ్మద్ సోహెల్, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ అన్నారు. మండల కేంద్రమైన చాగలమర్రిలోని ప్రాథమిక పాఠశాల (మేయిన్) భవనాలలో బుధవారం వైద్యాధికారి అంజలి, ఎంపీడీఓ మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 456 మందికి వైద్య సేవలు అందించారు. 18 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆసుపత్రులకు సిఫారసు చేశారు. 16 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభద్రమ్మ, వార్డు సభ్యులు డి.మన్సూర్, వి.మహబుబ్ షరీఫ్, నాయకులు షేక్.షబ్బీర్, ముల్లా.ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా దిశ యాప్

ఆళ్లగడ్డ: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం దిశ యాప్‌ను తీసుకు వచ్చిందని డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం(ఆర్‌పీఆర్‌పీ)లో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో దూసుకు పోవాలన్నారు. బాల్యవివాహాలు నేరమని, మంచిగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన దివ్య, ప్రియాంక, లక్ష్మీప్రసూనలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐ రమేష్ బాబు, ఎస్ఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థినులతో డీఎస్పీ వెంకటరామయ్య

గోస్పాడు: ఆడబిడ్డలకు రక్షణ కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి గోపాల్, కస్తూర్బా గాంధీ ప్రిన్సిపాల్ మానస అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గోస్పాడులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆడబిడ్డలను రక్షించుకుందాం – సృష్టిని కాపాడుదాం అంశం పై విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

విధుల్లో అలసత్వం వద్దు

నంద్యాలఅర్బన్: ప్రజలకు సేవలందించే విధుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శించ వద్దని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మెప్పు పొందాలని సూచించారు. ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ సంబరం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి
- అల్లూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఉయ్యాలవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటా ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా సంక్షేమ ఫలాలు అందించడంతో సంబరం నెలకొందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అల్లూరు గ్రామంలో జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కూలూరు రామకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు ఆరికట్ల శివారెడ్డి, పెమ్మిరెడ్డి ఎర్రారెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రజా ప్రతినిధులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు.



మహిళకు అభివాదం చేస్తూ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీ పోచా

2,828 మంది రూ. 11,02,39,461 లబ్ధి

గడిచిన నాలుగు సంవత్సరాల్లో గ్రామంలో 652 కుటుంబాల్లోని 2,828 మంది వివిధ పథకాల ద్వారా రూ. 11,02,39,461లు వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని ఎమ్మెల్యే వివరించారు. ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేసి దేశంలో నూతన రాజకీయ విధానానికి నాంది పలికిన ఘనత సీఎంకే దక్కిందని కొనియాడారు. పేదల సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని, ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, న్యాయవాది ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, నాయకులు మిట్టా నారాయణరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి, సింగిరెడ్డి దస్తగిరిరెడ్డి, కసాని ప్రతాప్‌రెడ్డి, జనపాల సాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- 27వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



7వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషాలు

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంతో గడప గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 27వ వార్డు దేవనగర్–2లో కో ఆప్షన్ సభ్యులు శోభారాణి, వార్డు ఇన్‌చార్జ్ బాషాలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, పరిపాలనలో ఆయన ఎన్నో సరికొత్త సంస్కరణలు చేపట్టారన్నారు. మత, కుల, రాజకీయ పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు పడకండ్ల సుబ్రమణ్యం, పున్న శేషయ్య, జాకీర్ హుస్సేన్, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు టీవీ రమణ, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, కౌన్సిలర్లు పున్న రాజేశ్వరి, అనురాధ, సావిత్రమ్మ, సాదిక్‌బాషా, మేస చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

పట్టణాభివృద్ధే లక్ష్యంగా రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలోని 7వ వార్డులోని ఫరూక్ నగర్‌లో రూ. 20లక్షలతో పూర్తి చేసిన డ్రైనేజీ కాల్వలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలుసుకున్న ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, ఆప్కోడైరెక్టర్ సుబ్బరాయుడు, కౌన్సిలర్లు కలాంబాషా, సమ్మద్, నాయకులు గన్నీ కరీం పాల్గొన్నారు. అలాగే 38వవార్డు వైఎస్సార్ నగర్‌లో రూ.65లక్షల వ్యయంతో సీసీ డ్రైన్ల ఏర్పాటుకు మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా భూమి పూజ చేశారు. కౌన్సిలర్ సావిత్రమ్మ, ఇన్‌చార్జ్ రమణ పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జగనన్న గోరు ముద్దలో భాగంగా 128 పాఠశాలలకు వంట సామగ్రి, 93 పాఠశాలలకు ఆట వస్తువులు, టీఎంఎఫ్ కింద క్లీనింగ్ మెటీరియల్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎండీయూ రేషన్ వాహనాల ద్వారా పాఠశాలలకు జెండా ఊపి పంపించారు. ఎంఈఓ బ్రహ్మంనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఎంపీపీ శెట్టిప్రభాకర్, వైస్ చైర్మన్ పాంశావలి, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, రాష్ట్ర చేనేత డైరెక్టర్ సుబ్బరాయుడు, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కిశోర్‌రెడ్డికి లేదు


ఆళ్లగడ్డ: ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదని, ఎదైనా ఉంటే ప్రజల్లోకి రా చర్చించుకుందాం అంటూ బీజేపీ బాధ్యులు భూమా కిశోర్‌రెడ్డిపై ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సవాల్ విసిరారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పల్లెనిద్ర అంటూ ఎక్కడికి వెళ్లితే అక్కడకి మద్యం, పూలదండలు నువ్వే పంపి వాటిని మెడలో వేయించుకునే పరిస్థితి నీదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గంగుల ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేశారని, దమ్ముంటే బయటకు రా ప్రజాకోర్టులో చర్చిద్దామన్నారు. ఎదో ఉనికిని కాపాడుకోవడానికి పలికమాలిన మాటలు మాట్లాడితే ఇక నుంచి ఊరుకునేది లేదన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఏ ప్రభుత్వం ఇవ్వనంతగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకా మా ఎమ్మెల్యే ఇప్పించారని చెప్పారు. ఎమ్మెల్యే కమిషన్ అడిగారని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కమిషన్లకు కక్కుర్తి పడేది భూమా కుటుంబమే అన్నారు. దమ్ముంటే రా 'నేను ఎంపీపీగా రాజీనామా చేస్తా.. ఎంపీటీసీగా ఇద్దరం పోటీ చేద్దాం' అంటూ సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

కూల్‌డ్రింక్ షాపుల్లో అగ్నిప్రమాదం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని రిక్వెస్ట్ స్టాప్ వద్ద ఉన్న రమణ, మహబుబ్‌బాషాలకు చెందిన కూల్‌డ్రింక్ షాపుల్లో బుధవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రమణకు చెందిన రూ.లక్ష విలువ చేసే 2 ఫ్రిజ్‌లు, దుకాణంలోని సరుకు మంటల్లో కాలపోయాయి. అలాగే అతని పక్కనే ఉన్న మహబుబ్‌బాషాకు చెందిన సోడా గ్యాస్ సిలిండర్, రెండు ఫ్రిజ్‌లు దగ్ధం కావడంతో సూమారు రూ. లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. చాగలమర్రి ఎస్ఐ రమణయ్య ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.



దగ్ధమైన కూల్‌డ్రింక్ షాపులు

కళలను వెలికి తీసేందుకే చిత్ర లేఖన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): చిన్నారుల్లో ఉన్న సృజనాత్మకతను, వారిలో దాగి ఉన్న కళలను వెలికి తీయడానికి చిత్ర లేఖనం పోటీలు దోహద పడతాయని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ 64 కళల్లో చిత్ర లేఖనానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. 1,2వ తరగతుల విద్యార్థులకు నచ్చిన చిత్రం, 4,5,6,7 తరగతుల విద్యార్థులకు పర్యావరణం ప్రకృతి అంశం, 8,9,10వ తరగతి విద్యార్థులకు మతసామరస్యం అనే అంశం పై చిత్ర లేఖనం పోటీలు జరిగాయి. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కన్వీనర్ రామరాజు తెలిపారు. చిత్రలేఖనం పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు మెమొంటోలు డీఆర్ఓ, కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు గోపాల్, గురుస్వామి, క్రాంతికుమార్, నాగేశ్, సాయిబాబ, వెంకటరమణ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఆర్ఓ, కమిషనర్ తదితరులు

సంక్షిప్తం

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని ఊడుమాల్పురం రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు దాదాపు 40 ఏళ్లు ఉంటుందని అంచనా వేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. వివరాలకు నంద్యాల రైల్వే అధికారులను సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనం నడుపుతున్న నిందితునికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేసినట్లు బుధవారం పోలీసు సిబ్బంది తెలిపారు. వివరాల మేరకు నందమూరి నగర్‌కు చెందిన సాయికుమార్ అనే వ్యక్తి గతేడాది డిసెంబర్‌లో మద్యం సేవించి వాహనాన్ని నడుపుతు రెండు సార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. కోర్టుకు హాజరు కాకపోవడంతో నంద్యాల పట్టణ ట్రాఫిక్ పోలీసులు చార్జ్ షీట్ తయారు చేసి అతన్ని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా జడ్జి 8 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

సదరం స్లాట్ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): వికలాంగుల సదరం బుకింగ్ స్లాట్ సమస్యలు పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్ వలి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వికలాంగుల సదరం సర్టిఫికెట్ల కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 7వ తేదీ వరకు అకాశం కల్పించిందన్నారు. అయితే ఎక్కడా స్లాట్లు బుక్ కాక వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సభ్యులు కిరణ్‌కుమార్, జిలాని, ముస్తఫా, వినోద్ పాల్గొన్నారు.

కార్మిక మరణాలపై స్పందించాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రీన్‌కో సంస్థలో పనిచేస్తున్న కార్మికుల మరణాలపై కార్మిక శాఖ స్పందించి, యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబఫక్రుద్దీన్‌లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పిన్నాపురం గ్రామంలో గ్రీన్‌కో సంస్థ నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న వలస కార్మికులు బీహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది పని చేస్తున్నారన్నారు. కూలీలకు సరైన సౌకర్యాలు, బద్రత లేకపోవడంతోనే మరణించారన్నారు.

ఆశా వర్కర్లపై పనిభారం తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆశావర్కర్లపై పని భారం తగ్గించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, శ్రీనివాసులు, ప్రసాద్ కోరారు. బుధవారం నంద్యాల పట్టణంలోని డీఎం అండ్‌హెచ్‌ఓకు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.